తల్లికి వందనం ఒట్టి మాటేనా?

- బడులు తెరిచి రెండు నెలలు దాటినా జమకాని సొమ్ము
- అసహనం వ్యక్తం చేస్తున్న తల్లులు
- గత ప్రభుత్వంలో సమయానికి అందిన అమ్మఒడి



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

కార్వేటినగరం: 'అధికారంలోకి వచ్చాక తల్లికి వందనం పథకం అమలు చేస్తాం.. స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సహాయమందిస్తా, ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి జమ చేస్తాం. మనస్సు ఉంటే మార్గం ఉంటుంది. డబ్బులు లేక పోతే సంపదను సృష్టించి ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తాం' ఇవీ సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు చెప్పిన మాటలు. ఆయన సీఎం అయ్యాడు. రెండు నెలల పాలన పూర్తికావొచ్చింది. సంక్షేమ పథకాల అమలు సమయం ఆసన్నమైంది. ఒక్కసారిగా సీఎం చంద్రబాబు మాటల్లో తడబాటు కనిపిస్తోంది. అధికారంలోకి రావడం కోసం నోటికి వచ్చిన హామీలను ఆకర్షణీయంగా గుప్పించిన ఆయన ఎన్నికల తర్వాత వాటిని పక్కకు పెట్టే మాటలు మాట్లాడుతున్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఆ ఊసే లేదు.

చెప్పింది చెప్పినట్లు చేశారు

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో విద్య, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తూ పాలన సాగించారు. చిన్నారుల బంగారు భవిష్యత్తు కోసం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. పిల్లలు ఉన్నతంగా ఎదగాలని ఆలోచన చేసి అమ్మఒడి పథకాన్ని అమలు చేశారు. 2019లో ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020-21 విద్యా సంవత్సరం నుంచి పిల్లలను బడికి పంపిస్తున్న తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15 వేలు చొప్పున జమ చేశారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ అమ్మ ఒడి సాయం క్రమం తప్పకుండా అందించారు. విద్యా పథకాల అమలుపై క్యాలెండర్‌ను విడుదల చేసి చెప్పింది చెప్పినట్లు సాయాన్ని అందజేశారు. నాలుగేళ్లుగా అమ్మ ఒడి పథకం ద్వారా వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో చదువుతున్న 17036 మంది విద్యార్థులకు తల్లికి వందనం నగదు జమ కావాల్సి ఉంది.



పిల్లలందరికీ వర్తింప జేయాలి

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీని నెరవేర్చాలి. తల్లికి వందనం పథకాన్ని అందరు పిల్లలకు వర్తింపజేయాలి. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అన్నమాట ప్రకారం తప్పకుండా అమలు చేయాలి.

– అమీద్, అల్లాగుంట, కార్వేటినగరం మండలం

ఇచ్చిన హామీని నెరవేర్చాలి

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీని నెరవేర్చాలి. తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమంది పిల్లలకు ఈ పథకం ద్వారా నగదు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. దీంతో పిల్లల తల్లిదండ్రులు హామీలను నమ్మి ఓటు వేశారు. ఇచ్చిన హామీని అమలు చేయాలి.

– మురళీకృష్ణారెడ్డి, ముక్కరవానిపల్లి, కార్వేటినగరం మండలం



క్లుప్తంగా

ఘనంగా ఊరేగింపు



అర్జున, ద్రౌపది అమ్మవారు

నింద్ర: మండల కేంద్రమైన నింద్రలో ఆదివారం ద్రౌపది, అర్జునుల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామస్తులు అమ్మవారి ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేక మాలలతో అలంకరించారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ సరికాదు



మాహిన్

నగరి: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ చట్ట సవరణ ముస్లింలకు తీవ్ర నష్టం కలిగించే అంశమని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మాహిన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు అధికారాలను తగ్గించడంతోపాటు మహిళలు, ముస్లింలు కాని వ్యక్తులను బోర్డులలో చేర్చాలనే ప్రతిపాదన ఏ మాత్రం సమంజసం కాదన్నారు. ఈ సవరణలతో ముస్లిం సమాజానికి తీవ్రనష్టం కలుగుతుందన్నారు. అవినీతిని తగ్గించి జవాబుదారీతనాన్ని పెంచాలనే లక్ష్యంతో ఈ ప్రతిపాదనలు చేస్తున్నట్టు చెబుతున్నప్పటికీ వక్ఫ్ బోర్డుల అధికారాలను కుదించే ప్రక్రియలో భాగంగానే ఈ సవరణ చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై కేంద్రం మళ్లీ సమీక్షించాలని ఆయన కోరారు.

వాగు కాదు.. తారు రోడ్డే..



వాగును తలపిస్తున్న సీడీ కండ్రిగ తారు రోడ్డు

కార్వేటినగరం: సీడీ కండ్రిగ గ్రామం సమీపంలో తారురోడ్డు వంకను తలపిస్తూ వాహన చోదకులకు దినదిన గండంగా మారింది. మండల కేంద్రం నుంచి గ్రామాలను కలుపుతూ కోదండరామాపురం వరకు గతంలో బీటీ రోడ్డు నిర్మించారు. రైతులు, విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. అయితే సీడీ కండ్రిగ గ్రామానికి చెందిన కొందరు మురుగు నీటిని రోడ్డుపై వదలడంతో రోడ్డు దుస్థితికి చేరుకుని వంకను తలపిస్తోంది. దీంతో కొత్తగా ఆ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు ప్రమాదానికి గురవుతున్నారు. ఇప్పటికే గుంతలమయంగా ఉన్న రోడ్డుపై మురుగునీటిలో పడి గాయాలైన వారు ఎందరో ఉన్నారు. మురుగు నీటితో రోడ్డు దుస్థితికి చేరుకుని ప్రమాదాలకు నిలయంగా మారింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని అక్కడివారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామం నుంచి రోడ్డుపై ప్రవహించే మురుగు నీటిని అరికట్టాల్సిన ఉంది.

కొనసాగుతున్న వైద్యశిబిరాలు



దళితవాడ వైద్య శిబిరంలో అతిసార బాధితునికి వైద్యం అందిస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: మండల కేంద్రంలోని దళితవాడ, ఇందిరమ్మ కాలనీ సచివాలయం-2 లో ప్రత్యేక వైద్య శిబిరాలు కొనసాగుతున్నట్లు ఆదివారం మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్ తెలిపారు. గత వారం రోజులుగా దళితవాడ, ఇందిరమ్మకాలనీలో అతిసారం కేసులు నమోదు కావడంతో బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మకాలనీలో అతిసారం అదుపులోకి వచ్చిందన్నారు. దళితవాడలో కేసులు వస్తున్నాయన్నారు. జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు వైద్య శిబిరాల్లో డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. జిల్లా ఉన్నతాధికారులు ప్రతి రోజు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆరోగ్య సిబ్బందితో సమీక్షించి తాగునీటి సమస్య, పారిశుధ్యం, అతిసారం వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి చర్చించామన్నారు. సమన్వయంతో అందుబాటులో ఉంటూ తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాధితులెవ్వరూ అధైర్యపడొద్దని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉమాదేవి, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, డాక్టర్లు రమేష్, లోకేష్, గ్రామ కార్యదర్శులు శంకరయ్య, అవంతి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్టుకు విరాళం

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని గో సంరక్షణ ట్రస్టుకు ఆదివారం ఓ దాత నగదు విరాళంగా అందించారు. నంద్యాలకు చెందిన మనోహర్‌రెడ్డి ట్రస్టుకు రూ.1,00,116 నగదు విరాళం చేశారు. వీరికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేసి స్వామి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది రవి తదితరులున్నారు.

శ్రీనరసింహస్వామికి స్వాతి నక్షత్ర పూజలు



నరసింహస్వామి పూజల్లో మాజీ మంత్రి

నగరి: నారాయణవనం మండలం సింగిరికోనలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీనరసింహస్వామి ఆలయంలో నిర్వహించిన స్వాతి నక్షత్ర విశేష పూజల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. ప్రతి ఏడాది స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి తిథి సందర్భంగా ఆలయంలో విశేషపూజలు నిర్వహిస్తారు. మాజీ మంత్రి ఆర్కేరోజా జన్మనక్షత్రం స్వాతి కావడంతో ఈ పూజల్లో ఆమె పాల్గొనడం పరిపాటి. ఈ మేరకు ఆదివారం ఉదయం ఆలయానికి వెళ్లిన ఆమె అభిషేక పూజల్లో స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ధర్మకర్తలు, పురోహితులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. పూజానంతరం స్వామివారి చిత్రపటాలను, ప్రసాదాలను సమర్పించి దుశ్శాలువాతో సత్కరించారు. ఆలయ ప్రధాన అర్చకులు, పురోహితులు ఆమెను వేదమంత్రాలతో ఆశీర్వదించారు.

వైభవంగా ద్రౌపదమ్మ తిరునాళ్లు



ద్రౌపదమ్మ ఆలయంలో మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి: మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడలో ద్రౌపదమ్మ తిరునాళ్లు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటా పండుగ వాతావరణం కనిపించింది. వీధులకు వేపాకు తోరణాలు కట్టారు. ద్రౌపదమ్మ ఆలయం వద్ద అమ్మవారి పాటలు మార్మోగాయి. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో భీమ, దుర్యోధన వేషధారణలో వచ్చిన వారు పోరాడే సన్నివేశం అందరినీ అలరించింది. 40 అడుగుల పొడవుతో తయారు చేసిన దుర్యోధన, దుశ్శాసన ప్రతిమలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆ ప్రతిమల వద్ద మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు ద్రౌపదీ, ధర్మరాజు, అలుగును దర్శించుకున్నారు. నిర్వాహకులు నటరాజన్ భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. చెన్నై నుంచి తెప్పించిన వివిధ రకాల భారీ రంగుల రాట్నాలు, పలు దుకాణాల వద్ద చిన్నారులు సందడి చేశారు. రాత్రి ఆలయ సమీపంలో నిర్వాహకులు అగ్నిగుండం ఏర్పాటు చేశారు. కంకణాలు ధరించిన భక్తులు పసుపు దుస్తులతో మంగళస్నానాలు చేసి అగ్నిగుండ ప్రవేశం చేశారు. తిరనాళ్లకు వేలసంఖ్యలో జనం వచ్చారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

ద్రౌపదమ్మ సేవలో మాజీ మంత్రి

తిరనాళ్లను పురస్కరించుకొని ఆదివారం ద్రౌపదమ్మను మాజీ మంత్రి ఆర్కే రోజా దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆమెను ఆహ్వానించి అమ్మవారి దర్శనం చేయించారు. అర్చనలు చేసుకున్న అనంతరం దుశ్శాలువాలతో సత్కరించి, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, మోహన్‌రాజ్, గోపాల్ రెడ్డి, బాబు, మురుగ, స్థానికులు గోవిందప్పన్, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.





దుశ్శాసన, దుర్యోదన వేషధారణలో స్థానిక భక్తులు, అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

పడవేటమ్మకు అంబలి ప్రసాదం



అమ్మవారికి ఊంజల్ సేవ

పాలసముద్రం: గ్రామంలో వెలసిన పడవేటమ్మకు వార్షిక మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి అంబళ్లు పోశారు. పాలాభిషేకం వైభవంగా చేపట్టారు. 10 గంటలకు భక్తులు అంబలి, పూజాసామగ్రిని పంబ వాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగించి అమ్మవారి ఎదుట అంబళ్లు పోశారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుంచి మహిళలు పాల బిందెలను గ్రామాల్లో ఊరేగించి అమ్మవారిని పాలతో అభిషేకించారు. సాయంత్రం అమ్మవారిని సుందరంగా అలంకరించి ఊంజల్ సేవ చేసి, ప్రత్యేక పూజలు చేశారు. కాపుకట్టిన భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూరం వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం అమ్మవారి ఎదుట అగ్నిగుండం, పుష్ప పల్లకీపై అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు. వార్షిక పూజలకు అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు ఆలయంలో కిటకిటలాడారు.



ఆలయంలో భక్తుల రద్దీ

యాళి వాహనంపై ద్రౌపదీదేవి అభయం





విశేష అలంకరణలో ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి, గెరిగ ఊరేగింపు

పుత్తూరు: శ్రీద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి యాళి వాహనంపై ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి భక్తులకు అభయమిచ్చారు. పురవీధుల్లో ఇంటింటా భక్తులు కర్పూర హారతులిచ్చారు. ఉదయం 6 గంటలకు స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడుగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకొంది. గెరిగ నీటితో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భాగవతారిణి స్వర్ణలత హరికథా గానం సాగింది. సాయంత్రం పాండవ, కౌరవ కుమారుల విద్యాభ్యాస ఘట్టం ఆకట్టుకుంది. ఈసందర్భంగా తిరుపతికి చెందిన నాగరత్నమ్మ పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్లను యాళి వాహనంపై కొలువుదీర్చారు. రాత్రి 9 గంటలకు బెస్త సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు వైభవంగా జరిగింది. అనంతరం లక్కాగృహ దహనం ఘట్టాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కార్యక్రమాలను సాళ్వాకం వంశీకులైన ఆలయ కోవిల్ కార్లు ఏలుమలై మొదలి, నటరాజ్ మొదలి, గోపి మొదలి, వెంకటేష్ మొదలి, పార్థసారథి మొదలి, కుప్పుస్వామి మొదలి పర్యవేక్షించారు. సోమవారం ఉదయం 6 గంటలకు గెరిగ ఊరేగింపు సాయంత్రం 4 గంటలకు హిడింబాసుర వధ, రాత్రి 8 గంటలకు శేష వాహనంపై స్వామి అమ్మవార్ల ఊరేగింపు ఉంటుంది.

బ్రహ్మానందాశ్రమంలో గీతాపారాయణం

బంగారుపాళెం: మండలంలోని మాధవనగర్‌లోని బ్రహ్మానందాశ్రమంలో ఆదివారం సాధువులచే గీతాపారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతాపారాయణ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి 16 మంది సాధుపుంగవులు మాధవనగర్ బ్రహ్మానందాశ్రమానికి వచ్చేశారు. ఆశ్రమ నిర్వాహకులు కేశవానందస్వామి ఆధ్వర్యంలో భక్తులు సాధుపుంగవులకు సాదరంగా ఆహ్వానం పలికారు. ఆశ్రమంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. గీతాపారాయణాన్ని వల్లించారు. గీతాపారాయణంతో కలిగే మానసిక ప్రయోజనాలను వివరించారు. అనంతరం సాధువులకు భక్తులు పాదపూజ చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆశ్రమంలో అన్నదానం చేశారు.

కంటబడితే.. కరిచేస్తున్నాయి



శ్రీకావేరిరాజుపురంలో గుంపులుగా వీధికుక్కలు



నియోజకవర్గవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నా యి. గ్రామంలో ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా భౌభౌ మంటూ శునకాల సంచారం బెంబేలెత్తిస్తోంది. రోడ్లపై, వీధుల్లో తిరుగుతూ పిల్లలు, వృద్ధులు, మేకలు, కోళ్లపై దాడులు చేస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులను వెంబడించి శునకాలు పరుగులు పెట్టిస్తున్నాయి. రాత్రి వేళల్లో మనుషులు కనిపిస్తే చాలు దాడి చేసి గాయపరుస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి తమను రక్షించాలని గ్రామ ప్రజలు అధికారులను కోరుతున్నారు. – పాలసముద్రం

- గ్రామాల్లో విచ్చలవిడిగా కుక్కల సంచారం
- చిన్నారులు, వృద్ధులు, మేకలు, కోళ్లపై దాడులు
- ద్విచక్ర వాహనదారుల ఇక్కట్లు

కుక్కకాటుకు గురైతే తీసుకోవాల్సిన చర్యలు

కుక్క కరిచిన మరుక్షణం ట్యాప్ వాటర్‌తో డిటర్జెంట్ సోప్(బట్టలు ఉతికే సబ్బు)తో కడగాలి. దీంతో 90 శాతం వైరస్ సోకకుండా ఉంటుంది. గాయానికి కట్టు కట్టకూడదు. రక్తం పోతుందని కట్టుకడితే వైరస్ మరింతగా వ్యాపించే ప్రమాదం ఉంది. వెంటనే డాక్టర్‌ను సంప్రదించి రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. కుక్క కరిచిన చోటు, విధానం, రేబిస్ కుక్క అయితే దానిని బట్టి ఐదు నుంచి ఏడు ఇంజక్షన్లు వేస్తారు. పిచ్చికుక్క (రేబిస్) కరిస్తే దానికి హీనోగ్లాబిన్ ఇంజక్షన్ వేయించుకోవాలి. ఈ ఇంజక్షన్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో లేదు.

వైద్యుడిని సంప్రదించాలి

సాధారణంగా చాలామందిలో వీధి కుక్క కరిస్తేనే రేబిస్ వ్యాధి సోకుతుందన్న భావన ఉంటుంది. అయితే వీధికుక్కలే కాదు పెంపుడు కుక్కలు కరిచినా రేబిస్ వ్యాధి సోకుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. ఇలా ఏ కుక్క కరిచినా వెంటనే వైద్యుడి వద్దకు వెళ్లి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసుకోవాలి. లేకుంటే కరిచిన ప్రదేశాన్ని బట్టి తలపై కరిస్తే మెదడు దెబ్బతిని పక్షవాతం సోకుతుంది. నాలుక, గొంతు పనిచేయకుండా ఆహారం తినే అవకాశం లేకుండా పోతుంది. నీరు చూసినా భయపడే పరిస్థితి వస్తుంది. చివరకు చికిత్సకు లొంగకుండా ప్రాణాంతకమవుతుంది. కరిచింది మన ఇంట్లో కుక్కే కదా అన్న భావన వీడి తక్షణమే చికిత్స చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పెంపుడు కుక్కలను వీధి కుక్కలతో కలవకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలి.



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు

పిల్లలను వీధుల్లో వదిలేందుకు భయం



పిల్లలను ఇతరులతో కలసి ఆటలు ఆడేందుకు వీధుల్లోకి పంపించేందుకు భయమేస్తోంది. వీధి కుక్కలు ఎక్కడ కరుస్తాయోనని ఆందోళన చెందుతున్నాం. నెల రోజు క్రితం మా పిల్లవాడు పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చేటప్పుడు కుక్కలు తిరగబడి కరిచేశాయి. రక్తం కారుతూ ఇంటికి వచ్చాడు. పాలసముద్రం ఆస్పత్రికి వెళ్లి ఇంజక్షన్లు వేయించాను.

– ఆర్.గౌతమి, కన్నికాపురం, దళితవాడ

శ్రీకావేరిరాజుపురంలో వంద కుక్కలున్నాయి



మండలంలోని శ్రీకావేరిరాజుపురంలో వందకు పైగా కుక్కలు ఉన్నాయి. మా మనవరాళ్లను ఇంటి ముందు ఆడుకోవడానికి పంపించాలంటే భయంగా ఉంది. రాత్రి వస్తున్న సమయంలో నన్ను కాళ్లపై కొరికేసింది. కుక్కల బెడద నుంచి కాపాడాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పెడచెవిన పెడుతున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అయినా స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలి.

– కె.రాజేంద్రన్, ఎస్‌కేఆర్ పురం

నిర్లక్ష్యం చేయవద్దు



కుక్క కరిచిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించి, ఇంజక్షన్ వేయించుకోవాలి. అది ఏమి చేస్తుందిలే అనుకుంటే ప్రాణానికే ముప్పు. ఆ కుక్క పెంపుడు కుక్క అయినా, వీధి కుక్క అయినా ఆలస్యం చేయొద్దు. కనీసం ఐదు నుంచి 7 వరకు ఇంజక్షన్లు వేసుకోవాల్సిందే. నెలకు 10 నుంచి 20 మంది వరకు కుక్కకాటుకు గురై ఆస్పత్రికి వస్తున్నారు. ఆస్పత్రిలో వ్యాక్సిన్ కొరత లేదు.

– డాక్టర్ మోహన్‌క్రిష్ణ, వైద్యాధికారి, పాలసముద్రం

రేబిస్ కుక్కల లక్షణాలు

కరిచిన ఏ కుక్క అయినా 14 రోజుల పాటు లక్షణాలు పరిశీలించాలి. రేబిస్ వ్యాధి సోకిన కుక్క ఇంట్లో వారి మాట వినదు. ఇంట్లో ఆహారం సరిగా తీసుకోదు. తరచూ నోటి నుంచి చొంగ కారుస్తూ ఉంటుంది. అంతేకాకుండా రెండుకాళ్లు మధ్యలో తోక ముడుచుకుంటున్న దానిని బట్టి కూడా రేబిస్ సోకిన కుక్కలా గుర్తించవచ్చు.

దూడలను, మేక పిల్లలను వెంటాడుతున్నాయి



వీధి కుక్కలు భయం ఎక్కువగా ఉన్నది. ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుతున్నాయి. కాస్త దూడలను, మేక పిల్లలను బయట వదిలేందుకు భయంగా ఉంది. ఎప్పుడు దూడలు, మేక పిల్లలపై దాడులు చేస్తాయో తెలియడం లేదు. రెండు రోజుల క్రితం కోడి పుంజుని తీసుకెళ్లిపోయాయి.

– క్రిష్ణయ్య, ఏటుకూరిపల్లె

రాత్రిళ్లు నిద్రపోవడానికి భయంగా ఉంది



కూలీ పనులకు వెళ్లి రాత్రి 8 గంటలకు వాహనాల్లో వచ్చేటప్పుడు దాడులు చేస్తున్నాయి. ఒంటరిగా గ్రామంలో వస్తుంటే భౌభౌ అని మొరుగుతూ పైకి ఎగబడుతున్నాయి. కుక్కలు గుమిగూడి మనుషులపై తిరగబడుతున్నాయి. భయంతో పరిగెత్తుకుంటూ పోతుంటే వెంటనే దాడులు చేస్తున్నాయి.

– ఎస్ ఆరుముగం, పాలసముద్రం, దళితవాడ

అసంపూర్తిగా భవన నిర్మాణం

– పునాదులకే పరిమితమైన వెలుగు కార్యాలయం



పిల్లర్లకే పరిమితమైన వెలుగు కార్యాలయ భవనం

గంగాధరనెల్లూరు: వెలుగు కార్యాలయానికి పక్కా భవనం సౌకర్యం లేక డ్వాక్రా సంఘాల మహిళలు ఏళ్లతరబడిగా నానా అవస్థలు పడుతున్నారు. అప్పట్లో ప్రతి మండలంలో డ్వాక్రా సంఘాల పురోభివృద్ధికి వెలుగు కార్యాలయాలను ప్రారంభించారు. అయితే అప్పటి నుండి వెలుగు కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. 2011లో మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ హయాంలో వెలుగు కార్యాలయం భవన నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేయించారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేశారు. పిల్లర్లతో బేస్‌మెంట్ వరకు పనులు అయ్యాయి. ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కోర్టును ఆశ్రయించిన వ్యక్తి కొంతకాలానికి మరణించారు. ప్రస్తుతం ఆ స్థలంలో ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయి అడవిని తలపిస్తోంది. సమావేశం పెట్టుకోవడానికి తగినంత చోటు లేక డ్వాక్రా మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో వెలుగు భవనం నిర్మించేందుకు ప్రజాప్రతినిధులు అధికారులు చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

పాలకుండలతో అభిషేకం



పాలాభిషేకం చేస్తున్న అర్చకుడు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆడినెలను పురస్కరించుకుని చిత్తూరు నగరం గుర్రప్పనాయుడువీధిలోని శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం పాలాభిషేకం అత్యంతవైభవంగా నిర్వహించారు. తొలుత స్థానిక వీధుల్లో పాలకుండలతో ఊరేగించారు. అనంతరం భక్తుల సమక్షంలో పాలాభిషేకం చేసి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కే ఎం కుమార్, అర్చకులు కుమార్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.